


# మగ మనసులు

ప్రమీలారాణి

**కృష్ణా ఎక్స్‌ప్రెస్** జోరుగా పరిగెత్తుతోంది. వల్లి కిటికీ దగ్గర కూర్చుని బయటకు చూస్తూంది.

ఎదురు బెర్తుమీద కూర్చున్న యువకుడు అదే పనిగ ఆమెను చూడసాగాడు. ఎంతసేపు చూసినా చెట్లు, చేనులు, కొండలు, గుట్టలు, ఎలక్ట్రిక్ స్తంభాలు తప్ప మరేం కనిపించకపోవటంతో వల్లికి విసుగేసింది. తల తిప్పి బాగ్‌లోంచి 'వీక్లీ' తీసి చదవసాగింది.

అతడు ఆమెను చూస్తూ మధ్య మధ్య బయటకు చూడసాగాడు.

కాసేపటికి పుస్తకం చదవటం కూడా అయిపోయింది. దానితో వల్లికి విసుగేసి మరేం చేయాలో అర్థంకాక గోళ్ళు కొరకటం మొదలెట్టింది. ఒక పది నిముషాల్లో ఆ పని కూడా అయిపోవటంతో శ్రద్ధగా చేతి గోళ్ళ కున్న ఎర్రరంగుని గీరేయటం మొదలెట్టింది.

అతడు ఆమె గోళ్ళవైపు చూశాడు. సన్నగా, పొడుగ్గా, తెల్లగా, సన్నజాజుల్లా ఉన్నాయి. ఆమె ముఖం వైపు చూశాడు. అందంగా, ముద్దుగా ఉంది. గోళ్ళ రంగు ఎందుకు గీకేస్తూందో అతడికి అర్థం కాలేదు.

'బాపు బొమ్మ' అనుకొన్నాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ! ఒకసారి ఆ 'వీక్లీ' ఇస్తారా?" అడిగాడు.

వల్లి ఉలిక్కిపడి గోళ్ళ రంగు గీకటం మాని తలెత్తి చూసింది.

అతడు చెయ్యి జాపి మళ్ళా పుస్తకం అడిగాడు.

వల్లి మవునంగా పుస్తకం అందించింది. మళ్ళా తన పనిలో నిమగ్నమైపోయింది.

అతను తాపీగా పుస్తకం ఒక అరగంట తిరగేశాడు. తరవాత తీరిగ్గా ఆమెవైపు చూశాడు.

ఈ సారి వల్లి ఏమో ఆలోచిస్తూ బయటకు చూస్తూంది.

"ఇదొండి పుస్తకం—థాంక్స్" అంటూ పుస్తకం

అందించాడు.

వల్లి మౌనంగా పుస్తకం అందుకుని ఒడిలో పెట్టుకొంది.

ఆ పెట్టెలో ఉన్న మిగతా వాళ్ళు అప్పుడప్పుడు వీళ్ళిద్దరిని గమనించసాగారు. కాస్సేపటికి వల్లి రెండు కాళ్ళు ఎత్తి బాసింపట్టు వేసుకుని కూర్చుంది.

"ఎక్కడిదాకా మీరు?" పలకరించాడతను.

"వరంగల్. మీరు?" తిరిగి అడిగింది.

"హైదరాబాద్. మీరు జాబ్ చేస్తున్నారా?"

"అవును. మీరు?"

"నేనుకూడా."

"ఏం జాబ్?"

"అసిస్టెంట్ ఇంజనీర్. మీరు?"

"కలెక్టరాఫీసులో చేస్తున్నాను."

"క్లర్క్‌గానా?"

"ఊఁ. మీ పేరు?"

"కృష్ణమూర్తి. మీ పేరు?"

"కల్పవల్లి."

ఆ తరవాత ఇద్దరూ నెమ్మదిగా మాటల్లో పడ్డారు. ఒక గంట తర్వాత రెండు కప్పుల కాఫీ కాంటీన్ నుంచి తెప్పించి, తనొకటి తీసుకొని, మరొకటి వల్లికి ఇవ్వబోయాడు.

"వద్దండీ!" మృదువుగా తిరస్కరించింది.

"ప్లీజ్! తీసుకోండి బాగోదు ఎలా చేస్తే" రిక్వెస్టు చేశాడు.

"ఉహూఁ ... నేను కాఫీ తాగనండి."

"ఫర్వాలేదు... తీసుకోండి. మీరు తీసుకోకపోతే చాలా బాధపడతాను." అతను నిరాశగా చూశాడు.

వల్లి తప్పనిసరిగా తీసుకోవాల్సి వచ్చింది.

"థాంక్స్" అంటూ కప్పు అందుకుని మెల్లగా తాగసాగింది.

ఆ కంపార్ట్‌మెంట్‌లో ఉన్న ప్రయాణీకుల కళ్ళన్నీ వీరిద్దరి మీదే. ఇద్దరిని అదే పనిగా అందరూ మార్చి మార్చి చూడసాగారు.

వల్లికి నవ్వు వచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నారు?" అతను అడిగాడు.

"వీళ్ళంతా చూడండి ఎంత వింతగా చూస్తున్నారో!" ఇంగ్లీషులో చిన్నగా చెప్పింది ముందుకువంగి.

కృష్ణమూర్తి పెద్దగా నవ్వేశాడు.

"మీ వరంగల్ వచ్చేస్తున్నట్లుంది" అన్నాడు.

ఖాళీ కప్పు కింద పెడుతూ చిన్నగా నవ్వింది వల్లి.

"ఎప్పుడైనా హైదరాబాద్ వస్తే మా ఇంటికి తప్పక రండి." ఆహ్వానించాడు.

"నాకు హైదరాబాద్ ఎక్కువగా తెలియదండి. నా ఫ్రెండ్ ఒకామె ఉంది—కాని తన అడ్రస్ తెలియదు." చెప్పింది.

"మీకు హైదరాబాద్‌లో ఏదన్నా పనిబడి వస్తుంటే నాకు లెటర్ వ్రాయండి—మీకు సిటీ అంతా చూపిస్తాను."

"థాంక్యూ. తప్పక వస్తాను."

"అయితే అడ్రెసు తీసుకోండి." కాగితంమీద తన అడ్రెసు వ్రాసి ఇచ్చాడు.

వల్లి అందుకొని ఒకసారి చదివి బాగ్‌లో పెట్టుకొంది.



"మీరు వచ్చే ముందు లెటర్ వ్రాస్తేసరి, స్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకుంటాను."

"థాంక్స్ ... అలాగే."

"అదో—మీ వరంగల్ వచ్చేసింది. మరి మీ అడ్రెసు?"

"మరిచిపోయా. ఉండండి, ఇస్తాను" అంటూ బాగ్‌లోంచి ఒక కాగితం ముక్క తీసి చకచక అడ్రెసు వ్రాసి ఇచ్చింది వల్లి.

అతను చిరునవ్వుతో అందుకున్నాడు.

"మీరేం బిడియపడవద్దు. హైదరాబాద్ తప్పక రావాలి. యూ ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్." పదే పదే చెప్పాడు.

"ష్యూర్" అంటూ వల్లి నవ్వింది.

అంతలో రైలు వరంగల్ స్టేషన్‌లో ఆగింది. జనం హడావుడిగా లేచి దిగసాగారు.

"వస్తానండి ... థాంక్స్" అంటూ వల్లి నవ్వి డోర్ వైపు కదిలింది. అప్పటివరకు వీరిద్దరినే గమనిస్తూ దిగటం మరిచిపోయిన మరి కొందరు వల్లి వెళ్ళటం చూసి హడావుడిగా తాముకూడా దిగటానికి లేచారు.

"మరిచిపోకండి. వీలుంటే లెటర్ వ్రాయండి." అతను తిరిగి చూస్తూ చెప్పాడు.

"అలాగే ... మీరుకూడా వ్రాయాలి." హడావుడిగా డోర్ దగ్గరికి వెళుతూ అంది.

"వో కే." అతను అన్నాడు.

వల్లి జనాన్ని తోసుకుని క్రిందకు దిగి అటు, ఇటు చూసింది.

కృష్ణమూర్తి కిటికీలోంచి తల బయటకు పెట్టి ఆమెనే చూస్తుండటంతో నవ్వుకుంటూ అతడు కూర్చున్న కిటికీ దగ్గరగా వచ్చింది.

"వెళ్ళొస్తానండి." మరోసారి చెప్పింది.

"మరిచిపోకండి. మీలాంటి స్నేహితురాలు దొరకటం చాలా అదృష్టం." అభిమానంగా అన్నాడు.

వల్లి అందంగా నవ్వింది. ఇంతలో రైలు కూత వేసింది.

"వో కె. సీ యూ." అతను అన్నాడు.

వల్లి తలూపింది చిరునవ్వుతో. ఇతనికి 'వో కె.' ఊతపదంలా ఉందే అనుకుంది.

"ఉంటానండి." మళ్ళీ అన్నాడు.

అంతలో వల్లికి ఒక ఆలోచన వచ్చింది.

"మీకు పెళ్ళయిందా?" ఆత్రంగా అడిగింది.

రైలు మెల్లగా కదిలింది.



"నేను బేచిలర్‌ని." కృష్ణమూర్తి చెప్పాడు.

వల్లి ఆశ్చర్యంగా చూసింది. కృష్ణమూర్తి నవ్వుతూ ఆమె వైపు చూశాడు.

రైలు ముందుకి సాగింది. కృష్ణమూర్తి నవ్వుతూ చెయ్యి ఊపాడు. రైలు క్రమంగా వేగం పుంజుకుని ప్లాట్‌ఫారమ్ వదిలి వెళ్ళటంతో వల్లి వెనుదిరిగింది. కృష్ణమూర్తి గురించి ఆలోచిస్తూ స్టేషన్ బయటకొచ్చి రిక్షా ఎక్కి ఇంటికొచ్చింది.

• • •

"వల్లి"

"ఊఁ."

"ఎప్పుడు మన పెళ్ళి?"

"మీ రెప్పుడంటే అప్పుడే."

"వారానికోసారి నా కిలా రావటం బోర్‌గా ఉంది. నెక్స్ట్ వీక్ నువ్వే రావాలి."

"వస్తాగాని నీ కో సంగతి వ్రాశాను—గుర్తుందా? ట్రైన్‌లో కృష్ణమూర్తి అనే అతను పరిచయం అయ్యాడని. పాపం, చాలా మంచివాడు. స్నేహానికి ప్రాణం ఇచ్చేలా ఉన్నాడు. చాలా మర్యాదస్తుడు కూడా. మొన్న యోగక్షేమాలతో ఒక లెటర్ వ్రాశాడు. ఎప్పుడన్నా హైదరాబాద్ వస్తే తప్పక మా ఇంటికి రావాలి అని పదే పదే వ్రాశాడు—వెళదామా?"

"ఊఁ... కాని ఇప్పుడు కాదు. ఎప్పుడన్నా వీలు చూసుకుని వెళదాం. అయితే అమ్మాయి గారికి మంచి స్నేహితుడు దొరికాడన్న మాట."

"నిజంగా చాలామంచివాడు, మురళీ. నేనుఎలాగూ డిపార్ట్‌మెంట్ పరీక్షలువ్రాద్దా మనుకుంటున్నానుగా! అవి హైదరాబాద్ వెళ్ళి వ్రాయాలి. అప్పుడు నువ్వుకూడా రా. వెళదాం."

"నీ ఇష్టం."

"మీ అమ్మావాళ్ళు ఏమంటున్నారు?"

"ఏమంటారూ? తొందరగా కోడలిని ఎత్తుకు రారా అంటున్నారు."

"ఛీ ... ఎత్తుకు రావడం ఏమిటి? తీసుకు రమ్మన్నారని చెప్పలేవూ!" వల్లి చిన్నగా మురళి నెత్తి మీద మొట్టికాయ వేస్తూ అంది.

మురళి ఆమె చెయ్యి పట్టుకొని గుప్పెటలో బిగించాడు.

"అదేనోయ్ ... ఎలా అయినా అర్థం ఒకటే కదా. మరి ఎప్పుడు చేసుకొందాం పెళ్ళి?"

"ఇంకో ఆరు నెలలు ఆగాలి."

"అబ్బ ...అప్పటివరకు ఈ రాకపోకలు తప్పవా?"

"మీ కంత కష్టం అయితే రాకండి."

"నాకు కష్టంగానే ఉంది. నువ్వే వస్తూండు."

"ఉహూఁ... నేను రాను. అయితే ఒక పని చేద్దాం. ఆరు నెలలు మనం కలుసుకోవద్దు. ఎవరికి రావాలనిపిస్తుందో వాళ్ళే రావాలి."

"వో కే. నేనయితే రాను. వస్తే నువ్వే పరుగెత్తుకు రావాలి."

"అబ్బ ... నేనేనా అంత నిగ్రహం లేనిది! మీరే వస్తారు చూడండి నాలుగు రోజుల్లో."

"బెట్టా?"

"వో ... బెట్."

"ఎంతెంత?"

# యువత

## మీ సాహితీ సంపద

నిర్వహణ: మంజుశ్రీ

### గత సంచికలో ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు

1. ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే అనే మహనీయుని స్వీయ చరిత్ర. ఇది 1934లో 'వంగ రసాయన శాస్త్రవేత్త జీవితానుభవాలు' అనే పేరున వెలువడింది.
2. కందుకూరి వీరేశలింగం పంతులు స్వీయ చరిత్ర.
3. రఘునాథ నాయకుడు. తంజావూరు రాజధానిగా పరిపాలించిన (1614—1633) రాజకవి.
4. విశ్వనాథ సత్యనారాయణ.
5. వావిలికొలను సుబ్బారావుగారికి. మందరమనే వ్యాఖ్యానంతో శ్రీమద్రామాయణాన్ని తెలుగున రచించారు.
6. 1905 వ సంవత్సరం. కొమర్రాజు లక్ష్మణరావు, రావిచెట్టు రంగారావు, నాయని వెంకట రంగారావు, ఆచంట లక్ష్మీపతి స్థాపకులు.
7. దాశరథి కృష్ణమాచార్యులుగారుకదూ. నేటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాస్థాన కవి.
8. ఉదయిని.
9. వినాయకచవితి.
10. (సుబ్రహ్మణ్య) భారతి.

## 2

### ప్రశ్నలు

1. పడవలే టాక్సీలుగా తిరిగే మహా నగరం ఏది? తెలుగులో వచ్చిన ఒక స్వీయ చరిత్రలో ఈ విషయం ప్రసక్తం.
2. సంగీతం, సాహిత్యం సరి తూచిన త్రాసు! ఎవరి గురించి, ఎవరన్నారీ మాట.
3. భోజరాజుకి వ్యతిరేకి. ఒక మహా సంగీత వాగ్గేయకారుడు.
4. లేపక్షి అంటే పుణ్యక్షేత్రమట.
5. పన్నుల సంపన్నుడు.
6. వెంకటేశ్వరస్వామి పూరి పేరు, ఇంటి పేరు, కలం పేరు అయిన ఆధునిక రచయిత లిద్దరు.
7. 'ఏంమి సన్నిధి సేసె సర్వేశ్వరుండు' — ఎక్కడిదీ పద్య పాదం.
8. తెలుగులో మొట్టమొదటి నవల.
9. నవ్యాంధ్ర సాహిత్యవీధులు ఎన్ని?
10. 'అచ్చట బుట్టిన చిగురు కొమ్మైన చేవ' — ఎవ రన్నారు, ఏ సందర్భంలో.

**సమాధానాలు వచ్చే సంచికలో**

"ఓడిపోయినోళ్ళు ఎవ రేదడిగినా ఇవ్వాలి."

"మరి మాట తప్పకూడదు చూడు."

"మీరే మాట తప్పకూడదు. ఒకసారి నేను మాట అన్నానంటే దానికి తిరుగు లేదు."

"వో కే... డార్లింగ్. నేనే గెలుస్తాను చూడు. అప్పు డవుద్ది అమ్మాయిగారి పని."

"ఏం కాదు. నేనే గెలుస్తాను. చూస్తూండండి."

"చూస్తూనే ఉన్నాను" అంటూ మురళి దగ్గరకు లాక్కోవటంతో వల్లి సిగ్గుతో అతడి కౌగిలిలో ఒదిగిపోయింది.

• • •

"మీరు వస్తారో రారో అని చాలా కంగారు పడ్డాను." ట్రెయిన్ దిగిన వల్లిని చూస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

వల్లి బిడియంగా నవ్వింది.

ఆమె డిపార్ట్‌మెంటల్ టెస్ట్ ఎగ్జామ్స్ వ్రాయటానికి హైదరాబాద్ వచ్చింది. మురళిని కూడా రమ్మని పదే పదే అడిగింది. చివరి క్షణంలో మురళి ఇన్‌స్పెక్షన్ ఉందని ఆగిపోయాడు. కృష్ణమూర్తిని అడిగినట్లు చెప్పమని వ్రాశాడు.

వల్లికి హైదరాబాద్‌లో తెలిసిన వాళ్ళెవరూ లేకపోవటంతో తను వచ్చే కారణం వివరిస్తూ కృష్ణమూర్తికి లెటర్ వ్రాసింది.

కృష్ణమూర్తి ఆ లెటర్ చదివి చాలా సంతోషపడ్డాడు. స్నేహితురాలిని కలుసుకుంటున్నందుకు అతడి మనస్సు సంతోషంతో వూగిసలాడింది. 'వల్లి చాలా అమాయకురాలు' అనుకున్నాడు.

"మురళిగారు రాలేదేం?" అడిగాడు.

"ఇన్‌స్పెక్షన్ ఉందట. రాలేకపోయారు." చెప్పింది.

ఇద్దరూ వచ్చి ఆటో ఎక్కారు.

"మీ రొక్కరే ఉంటారా?" అడిగింది.

"వూఁ. ఈ రోజు ఆఫీసుకు సెలవు పడేశాను. మీ కేం భయం లేదు. నేను నా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళిపోతాను ఈ రాత్రికి. రేపు మళ్ళా ఉదయం కలుస్తాను." చెప్పాడు సిన్సియర్‌గా.

"థాంక్స్ ... మీ మేలు మరిచిపోలేను." మొహమాటంగా అంది వల్లి.

ఆటో వెళ్ళి ఒక సందు మలుపు తిరిగి ఒక చిన్న ఇంటిముందు ఆగింది.

"దిగండి—ఇదే ఇల్లు" అంటూ కృష్ణమూర్తి ఆటో దిగి ఫేర్ చెల్లించాడు. ఆటో వెళ్ళిపోయింది.

"ఇలా రండి" అంటూ కొంచెం లోపలికి నడిచి ఇంటి తాళం తీశాడు.

చక్కగా రెండు గదులున్న ఇల్లు అది. అన్ని సౌకర్యాలతో ఉంది. బ్రహ్మచారులు ఉన్న గది ఎలా ఉంటుందో అతడి గదికూడా అలాగే ఉంది. ఒక మంచం, రెండు కుర్చీలు, అల్మారా నిండా పుస్తకాలు, సూట్‌కేస్, రేడియో, టేప్‌రికార్డర్—అన్నీ నీట్‌గా కన్పిస్తున్నాయి.

ఇల్లుకూడా నీట్‌గా, పొందికగా ఉంది.

వల్లికి బిడియమనిపించినా ఇంటినిచూసి ముచ్చటపడింది. ఇల్లు కొంచెం లోపలికి సెపరేట్‌గా ఉండటంతో వల్లికి బాగా నచ్చింది.

'రేపు పెళ్ళయితే ఇలాటి ఇల్లే తీసుకోవాలి. మురళికి చెప్పాలి. కాని మూడు గదులు ఉండేట్లు చూసుకోవాలి' అనుకుంటూ చుట్టూ కలియతిరిగి చూడసాగింది.

"ఎలాఉంది ఇల్లు...కూర్చోండి." కృష్ణమూర్తి చెప్పాడు.

"ఇల్లు చాలా చాలా బాగుంది. రెంట్ ఎంత అన్నారు?" అడిగింది.

"రెండొందలు..." మూర్తి నవ్వుతూ అన్నాడు.

వల్లి ఆశ్చర్యపోయింది. 'అమ్మో! రెండొందలా?' అనుకొంది.

"కూర్చోండి." కృష్ణమూర్తి మళ్ళా చెప్పాడు.

వల్లి ఒక కుర్చీలో పొందికగా కూర్చుంది.

"స్నానం చేస్తారా? మీరేం మొహమాట పడక్కర్లేదు. మీ సొంత ఇల్లులా భావించాలి. నే నలా బయటికెళ్ళొస్తాను." స్నేహపూర్వకంగా చెప్పాడు.

వల్లి నవ్వింది.

కృష్ణమూర్తి బాత్‌రూమ్, సోపు చూపించి బయటికెళ్ళిపోయాడు. వల్లి ప్రయాణపు బడలిక తీర్చుకోవటానికి లేచి స్నానం చేసి తల దువ్వుకొని కూర్చుంది.

మరో అరగంటలో కృష్ణమూర్తి క్యారియర్‌తో వచ్చాడు.

ఇద్దరూ కలిసి భోజనం ముగించారు. భోజనం చేస్తున్నంతసేపు ఎన్నో కబుర్లు, నవ్వులు దొర్లినాయి వారి మధ్య.

వల్లికి చాలామటుకు బిడియం తగ్గిపోయింది.

కృష్ణమూర్తి సొంత మనిషిలా ఎంతో ఆదరంగా మసలుతున్నాడు. భోజనం చేసేటప్పుడు కొసరి కొసరి వడ్డించాడు. దానితో వల్లికి కొంచెం ధైర్యం వచ్చింది. కొత్త మరిచిపోయి తనూ ఫ్రీగా

మాట్లాడసాగింది. ఎన్నో కబుర్లు చెప్పి నవ్వించాడు కృష్ణమూర్తి.

ఎక్కడా అసభ్యత... వెకిలితనం మచ్చుకి కూడా కనిపించలేదు. ఎంతో ఆత్మీయంగా, నిజమైన స్నేహితుడిలా ప్రవర్తించాడు. వల్లికి చాలా సంతోషం వేసింది. వెళ్ళగానే మురళికి లెటర్ వ్రాయాలి. తను రాలేదు గాని వస్తే ఎంత బాగుండేది. ఈ హైదరాబాద్‌లో ఇతడే గాని తెలియకపోతే ఎంత కష్టపడాల్సి వచ్చేదో!"

"మీకేం భయం లేదు. పడుకోండి. నేను నా ఫ్రెండ్ దగ్గర ఈ రాత్రికి ఉండి తెల్లారే వస్తాను." కృష్ణమూర్తి చెపుతున్న కబుర్లు ఆపి లేచి నించున్నాడు.

"అప్పుడే వెళతారా! ఇంకొంచెం సేపు కూర్చోండి." అభ్యర్థనగా చూసింది.

కృష్ణమూర్తి మళ్ళా కూర్చున్నాడు. మరి కాసేపు కబుర్లు అయినతరవాత "మీరు మ్యారేజి ఎప్పుడు చేసుకొంటారు?" అని హఠాత్తుగా అడిగాడు కృష్ణమూర్తి.

వల్లి ఒక్క క్షణం తెల్లబోయి తరవాత సిగ్గుగా నవ్వేసింది.

"ఇప్పుడప్పుడే చేసుకొనే ఆలోచన లేదా!" కుతూహలంగా చూస్తూ అడిగాడు.

వల్లి చిరునవ్వుతో "అంతా నిర్ణయం అయిపోయింది. ఇంకో ఆరు నెలలలో మ్యారేజి" అంది.

"కంగ్రాట్స్... అయితే మాకు త్వరలో విందున్నం ఉందన్న మాట." కృష్ణమూర్తి నవ్వుతూ అన్నాడు.

"థాంక్స్." వల్లి నవ్వుతూ తలవంచుకుంది.

"అతనేం చేస్తుంటాడు?"

"పి. డబ్ల్యు. డి. డివిజన్‌లో సూపర్‌వైజర్. పేరు మురళి. మాది లవ్ మ్యారేజి." నవ్వుతూ అంది.

"ఓ . . . అదృష్టవంతులు ఇక నే వెళతానండి. హాయిగా నిద్రపొండి" అంటూ లేచి నించున్నాడు కృష్ణమూర్తి.

వల్లి కూడా లేచింది. అతడు గుడ్‌నైట్ చెప్పి వెళ్ళిపోయాడు. వల్లి తలుపులు గడియ పెట్టుకొని వచ్చి మంచం మీద వాలిపోయింది. ఆమె కృష్ణమూర్తి సహృదయానికి ఎంతో అబ్బుర పడింది. ఈ కాలంలో—అదీ ఏదో ట్రెయిన్‌లో పరిచయం అయినంత మాత్రాన ఇంటికి ఆహ్వానించి ఇంత చక్కటి ఆతిథ్యమిచ్చి, ముఖ్యంగా ఇలా ఇల్లు అప్ప జెప్పి వెళ్ళడంటే... ఎంతటి మంచి మనిషి అయి ఉండాలి!

మురళి ఏం చేస్తున్నాడో? ఈసారి మురళిని కూడా తీసుకొచ్చి పరిచయం చేయాలి. అవును... తన 'బర్త్‌డే' కూడా వస్తోంది. అప్పుడు కృష్ణమూర్తిని ఆహ్వానించి ఇద్దరికీ పరిచయం చేయాలి. రేపు పరీక్ష అయిపోగానే సాయంకాలం మళ్ళా మద్రాసు ఎక్స్‌ప్రెస్‌కి వెళ్ళిపోవాలి. పేపర్ ఎలా ఉంటుందో ఏమో! ఈ టెస్ట్ పాసైతే చక్కని ప్రమోషన్ దొరుకుతుంది. అబ్బ...



నిద్రొస్తోంది అనుకుంటూనే ఆలోచిస్తూ నిద్ర పోయింది.

• • • •

"ఎలా వ్రాశారు?" కృష్ణమూర్తి ఎదురొస్తూ అడిగాడు.

"బాగానే వ్రాశాను. నేను సాయంకాలం వెళ్ళిపోతానండి." చెప్పింది వల్లి.

"అదేం... ఉండండి, రేపు సాయంత్రం వెళుదురు గాని. మీకు సిటీ చూపిస్తాను."

"ఊహూం... వద్దు వెళ్ళిపోతాను. ఈసారి వచ్చినప్పుడు తప్పక చూపెడుదురు గాని."

ఒకె ... కాని మాట నిలబెట్టుకోవాలి. నెక్స్ట్ మంత్ నా బర్త్ డే ఉంది. మీరు తప్పక రావాలి."

"తప్పకుండా. ఈ మంత్ నా బర్త్ డే కూడా ఉంది—ఇరవై తారీకున. మీరుకూడాతప్పక రావాలి."

"ష్యూర్... ఒక్క సారే భోజనంచేసి వెళతాం."

"మీ ఇష్టం."

ఇద్దరూ హొటల్‌కి వెళ్ళి భోజనం చేసి తిరిగి ఇంటి కొచ్చారు.

"కాసేపు పడుకోండి. నేనలావెళ్ళొస్తాను. ఇంకా టైమ్ ఉంది కదా" అంటూ కృష్ణమూర్తి వెళ్ళిపోయాడు.

వల్లి అతడి సంస్కారానికి మనసులోనే మెచ్చుకొంది. పడుకొని కళ్ళు మూసుకొంది. వెంటనే నిద్ర పట్టేసింది.

"ఏమండోయ్ వల్లిగారూ... టైమ్ అయింది" అన్న కేకతో ఉలిక్కిపడి లేచింది వల్లి. అతను వచ్చేదాకా అలా మొద్దులా నిద్రపోయినందుకు సిగ్గుపడింది. లేచి మొహం కడుక్కొని తొందరగా తయారైంది. కృమూర్తి కూడా తయారైన తర్వాత ఇద్దరూ ఇంటికి తాళం పెట్టి స్టేషన్ కొచ్చారు. టికెట్ తీసుకొని ఇంకా పావు గంట టైమ్ ఉండటంతో కాంటీన్‌లో కూర్చున్నారు.

"మీలాటి స్నేహితుడు దొరికినందుకు నిజంగా నేను చాలా గర్వపడుతున్నానండి." వల్లి ఆప్యాయంగా అంది.

కృష్ణమూర్తి నవ్వాడు. "దాని దే ముందండి... మనుషులన్న తర్వాత ఒకరినొకరు కలుసుకొని సహాయం చేసుకోవాలి."



"కాని అందరికి మీలాటి మంచి గుణం ఉండొద్దూ!"

"మీరు నన్ను మరీ పొగిడేస్తున్నారు."

"కాదు—ఉన్న మాట చెపుతున్నాను."

ఇంతలో మద్రాస్‌ఎక్స్‌ప్రెస్ రావటంతో ఇద్దరూ లేచి ట్రెయిన్ దగ్గరికి నడిచారు వల్లి ఎక్కి కూర్చున్న తర్వాత "మీ సహాయానికి చాలా కృతజ్ఞతలు. ఎప్పటికీ మీ మేలు మరిచిపోలేను." అభిమానంగా చూస్తూ అంది.

కృష్ణమూర్తి నవ్వాడు. "వెళ్ళగానే చేరినట్టు లెటర్ వ్రాయండి. మర్చిపోవద్దు" చెప్పాడు.

"తప్పకుండా...మర్చిపోవటమా! ఊహూం... అలా మరిచిపోతే నా అంత కృతఘ్నురాలు ఇంకొకటి ఉండదనుకోవాలి. మీరు మళ్ళీ వెంటనే రిప్లయి వ్రాయాలి."

ఇంతలో బండి కదలడంతో "ఒకె ...మరి ఉంటానండి. జాగ్రత్తగా వెళ్ళండి." బండితోపాటు నడుస్తూ చెప్పాడు.

అతడి ఆప్యాయతకు వల్లి మనసు చలించింది. అభిమానంగా అతడి వేపు చూస్తూ ఆత్మీయత గుండె నిండగా అనుకోకుండా కిటికీలోంచి చెయ్యి అతడికి వెళుతున్నానన్నట్లు అందించింది.

కృష్ణమూర్తి చిరునవ్వుతో ఆమె చెయ్యి అందుకొని, ఆప్యాయంగా నొక్కి వదిలి పెట్టాడు. ఇద్దరి మనస్సులు అదో విధమైన ఆనందంతో బరువెక్కాయి. అనుకోకుండా జరిగే కొన్ని కొన్ని పరిచయాలు జీవితంలో మరిచిపోలేనివిగాఉంటాయి. ఒకరికొకరు కన్పించేవరకుఇద్దరు చేతులూపుతునే ఉన్నారు.

బండి కనుమరుగవగానే భారమైన మనస్సుతో కృష్ణమూర్తి వెనుదిరిగాడు. 'వల్లిచాలా మంచి పిల్ల' మరోసారి అనుకొన్నాడు.

• • •

వల్లి ఇల్లు చేరుకోగానే మరిచిపోకుండా కృష్ణమూర్తికి లెటర్ వ్రాసింది. ఉత్తరం నిండా అతడి మంచితనాన్ని పొగుడుతూనే వ్రాసింది.

కృష్ణమూర్తి నవ్వుకొన్నాడు. 'పిచ్చి పిల్ల' మరోసారి అనుకొన్నాడు. తిరిగి వెంటనే రిప్లయి ఇచ్చాడు.

అప్పటినుంచి వారానికొకటి చొప్పున ఇద్దరూ ఆత్మీయంగా లెటర్స్ వ్రాసుకోసాగారు. రోజు రోజుకి వారిద్దరి మధ్య మరింత సాన్నిహిత్యం ఏర్పడింది. వల్లి తమ పరిచయం గురించి ఎప్పటికప్పుడు మురళికి తెలియజేస్తూనే ఉంది. వల్లి మరీ కృష్ణమూర్తిని ఆకాశానికి ఎత్తేస్తూ పొగిడే ఉత్తరాలు చదువుకొని మురళి నవ్వుకోసాడు. అతడిని చూడాలనే ఆత్రత అతనిలో కూడా కలగసాగింది.

• • •

"అబ్బ! వచ్చారా? మీరు వస్తారో రారో అని ఎంత కంగారుగా ఉందోతెలుసా" వల్లి ఎదురేగి సంతోషంతో ఆహ్వానించింది.

కృష్ణమూర్తి చిరునవ్వుతో లోని కొచ్చాడు.

మురళి ఎదురెళ్ళి "ఐ ఆమ్ మురళి" అంటూ చెయిఅందించాడు. కృష్ణమూర్తిమురళితో కరచాలనం చేశాడు.

వారిద్దరిని ముందు గదిలో కూర్చోబెట్టి వల్లి

వంట గదిలోకి నడిచింది. పని మనిషి సహాయంతో భోజనానికి అన్నీ సిద్ధంచేసి ఇద్దరినీ పిల్చింది.

వల్లి కృష్ణమూర్తి దగ్గర కూర్చొని కొసరి కొసరి వడ్డించింది. వడ్డించినంత సేపు హైదరాబాద్‌లో అతను తన కిచ్చిన ఆతిథ్యాన్ని గురించి పొగుడుతూ మురళికి చెపుతూనే ఉంది.

ఆఖరున "నిజంగా మీలాంటి మంచి మనుష్యలను ఎక్కడా చూడలేదు" అంటూ సర్టిఫికెట్ ఇచ్చేసింది.

కృష్ణమూర్తి, మురళి ఇద్దరూ నవ్వేశారు.

కృష్ణమూర్తి వల్లి పుట్టిన రోజు కానుకగా చక్కని కాశ్మీర్ చీర బహూకరించాడు.

వల్లి తెగ మెచ్చుకుంది చీర సెలక్షన్‌ని. "మీ కాబోయే భార్య ఎవరోగాని చాలా అదృష్టవంతురాలండోయ్" అంటూ నవ్వింది.

ఆ రాత్రికి ఉండమని ఎంత బ్రతిమిలాడినా కృష్ణమూర్తి ఉండలేదు. ఆఫీసుకు తప్పక అటెండవాలి, పనుందంటూ మృదువుగా తిరస్కరించాడు. మురళి, వల్లి ఇద్దరూ స్టేషన్‌కు వెళ్ళి కృష్ణమూర్తిని బండెక్కించి వచ్చారు.

మరునటి రోజు ఉదయమే మురళి కూడా వూరెళ్ళిపోయాడు. వల్లి ఎప్పటిలా ఇంట్లో ఒంటరిగా మిగిలిపోయింది.

● ● ● ●

మరునటి నెలలో కృష్ణమూర్తి బర్త్ డే కి మురళి, వల్లి ఇద్దరూ హైదరాబాద్ వెళ్ళారు. కృష్ణమూర్తి వాళ్ళను మూడు రోజుల వరకు వెళ్ళనివ్వకుండా వూరంతా తిప్పి చూపించాడు. విరివిగా డబ్బు ఖర్చుపెట్టాడు. మురళి అతడి మంచితనానికి చాలా ఆశ్చర్యపోయాడు. ఇద్దరూ ఆ మూడు రోజుల్లోనే ప్రాణ స్నేహితులుగా కలిసిపోయారు. ఎన్నెన్నో విషయాలు చెప్పుకున్నారు, మాట్లాడుకున్నారు.

నాలుగో రోజు మురళి, వల్లి తిరిగి వచ్చేశారు. ఇప్పుడు ముగ్గురి మధ్య ఉత్తరాలు, రాకపోకలు జోరుగా జరగసాగాయి. ఆరు నెలలలో ముగ్గురూ సొంత ఇంట్లో వాళ్ళకన్న ఎక్కువగా కలిసిపోయారు.

● ● ●

"వారం నుంచి మీ దగ్గర రిప్లయి రాకపోవటంతో కంగారుపడి వచ్చాను." వల్లి కుర్చీలో కూర్చుంటూ అంది.

ఆ సాయంత్రమే ఆమె బస్సులో హైదరాబాద్ వచ్చింది. కృష్ణమూర్తి మొహం వాడిపోయి ఉంది.

"ఎందు కలా ఉన్నారు?" అతడి మొహంచూస్తూ కొస్తంత ఆందోళనగా అడిగింది.

"ఏం లేదు, వల్లీ. ఈ వారంరోజులు ఇన్‌స్పెక్షన్ వూపిరి తిరగని పని. అందుకే రిప్లయి ఇవ్వలేకపోయాను." చెప్పాడు.

"మరి అయిపోయిందా?"

"వూఁ. నిన్ననే అయింది. విశేషాలు చెప్పు. మురళి ఎలా ఉన్నాడు? రెండు లెటర్సు వ్రాశాడు. నేనే బిజీగా ఉండిపోయి రిప్లయి ఇవ్వలేదు."

"బాగానే ఉన్నాడు. వాళ్ళ ఇంటి కెళ్ళాడు. ఇదో చూడండి" అంటూ బాగ్ లోంచి కవరొకటి తీసి ఇచ్చింది.



కృష్ణమూర్తి అందుకొని చూశాడు. అది మురళి, వల్లీల వెడ్డింగ్‌కార్డు. పెళ్ళి ఇంకో వారం రోజులే ఉంది.

"కంగ్రాట్స్ ... ఒక నాలుగు రోజులు ముందే సెలవుపెట్టి వచ్చేస్తాను. పెళ్ళి మురళి ఇంటి దగ్గరే కదా!"

"అవును. మీరు తప్పక రావాలి. మీరు రానిదే ఆ పెళ్ళి మటుకు జరిగేది లేదు. నాకు అమ్మ తప్ప ఎవ్వరూ లేరు. నా తరపు బంధువులు మీరే." వల్లి చెప్పింది.

కృష్ణమూర్తి నవ్వాడు. ఆ తరవాత పెళ్ళి విషయాలు ఏవేవో మాట్లాడుకున్నారు కాసేపు.

"కారియర్ తెస్తాను." కృష్ణమూర్తి లేచాడు.

"వద్దు ... హోటల్‌కి వెళదాం. వస్తాను." వల్లి చెప్పింది.

ఇద్దరూ హోటల్‌కివెళ్ళిభోజనం ముగించివచ్చారు.

"మీరు చాలా అలిసిపోయి ఉంటారు. అందులో బస్సు ప్రయాణం. నిద్రపొండి. నేను నా ఫ్రెండ్ ఇంటికి వెళతాను." కృష్ణమూర్తి చెప్పాడు.

"ఊహుఁ ... మీరు వెళ్ళొద్దు. మీరు ముందు గదిలో పడుకోండి. నేను వెనక గదిలో పడుకుంటాను, బెడ్డింగ్ వేసుకుని." వల్లి చెప్పింది.

కృష్ణమూర్తి ముందు ఒప్పుకోకపోయినా వల్లి బలవంతం చేయటంతో సరేనన్నాడు. మరునటి ఉదయమే వల్లి వరంగల్ ప్రయాణమై వచ్చేసింది.

● ● ● ●

"మూర్తి! నువ్వు చెప్పేది నిజమేనా?" మురళి తెల్లబోతూ అడిగాడు.

అతడి మొహం పాలిపోయింది. చూస్తే పెళ్ళి మూడు రోజులే ఉంది. అతడికి కృష్ణమూర్తి చెప్పింది వింటుంటే నమ్మ బుద్ధి కావటం లేదు.

"కావాలంటే వల్లిని అడుగు." కృష్ణమూర్తి చెప్పాడు.

మురళికి ఒక్క క్షణం నిల్చో బుద్ధి కాలేదు. కృష్ణమూర్తిని తీసుకుని వల్లి వూరొచ్చి వల్లిని కలుసుకున్నాడు.

వల్లికి వీళ్ళిద్దరిని చూడగానే, ముఖ్యంగా మురళిని చూడగానే గుండె ఆగినంత పనయింది. ఆమె ముఖం నల్లగా మాడిపోయింది. ఇద్దరినీ మవునంగా గదిలోకి ఆహ్వానించి కూర్చోమంది. కృష్ణమూర్తి కూర్చున్నాడు కాని, మురళి కూర్చోలేదు.

"వల్లీ, నేను విన్నది నిజమేనా?" సూటిగా చూస్తూ అడిగాడు మురళి.

అతడి గుండెలో ఎన్నో అగ్నిగుండాలు పగులుతున్నాయి. మొహం అంతా రాయిలా కఠినంగా ఉంది.

వల్లికి మురళి మొహం చూస్తుండగానే గుండె ధైర్యం కోల్పోసాగింది. బలవంతాన తనలో దిగజారుతున్న ధైర్యాన్ని కూడగట్టుకుని స్థిరంగా ఉండటానికి ప్రయత్నించసాగింది.

"ఏం విన్నారూ?" విసురుగా, కోపంగా అడిగింది.

"కృష్ణమూర్తి చెప్పింది నిజమేనా?"

వల్లి కృష్ణమూర్తి వైపు అసహ్యంగా చూసింది.

"ఏం చెప్పా డేంటి?" వ్యంగ్యంగా అడిగింది.

"నువ్వు మొన్న హైదరాబాద్ వెళ్ళిన రాత్రి అనుకోకుండా మీ రిద్దరూ ఒక టయ్యారట. నిజమేనా? కృష్ణమూర్తి జరిగినదానికి చాలా బాధ పడుతున్నాడు. జరిగిన తప్పుకి ప్రాయశ్చిత్తంగా నిన్నే పెళ్ళి చేసుకుంటా నంటున్నాడు." మురళి ఎలాగో చెప్పాడు. అలా చెపుతున్నప్పుడు తల పగల గొట్టుకుని చావా లనిపించింది. అలాంటి పరిస్థితి వస్తుందని అతడు కలలో కూడా భావించలేదు.

వల్లిని ఎంతో గాడంగా ప్రేమించాడు. ఇప్పుడు ఆమె లేని జీవితం వూహించుకోటానికే భయంకరంగా ఉంది. జరిగినది విన్న దగ్గర్నుంచి మనిషి నిరాశ, నిస్పృహలతో గడ్డిపోచలా వణికిపోసాగాడు. బుర్ర పనిచేయటం మానేసింది. అసలు అతడికి వల్లి అంత పని చేసిందంటే నమ్మటానికి ఆశ్చర్యంగా ఉంది.

"అతడు చేసుకుంటానన్నా ఇక్కడ చేసుకోవటానికి ఎవరూ రెడీగా లేరు." నిర్లక్ష్యంగా అంది.

"అంటే?!" మురళి అర్థం కానట్టు చూశాడు.

"ఎందుకు చేసుకోవాలి?" ఎదురు ప్రశ్నించింది.

మురళికి పట్టరాని కోపం వచ్చింది.

"కాలు జారినప్పుడు చేసుకోక ఏం చేస్తావ్?"

"నేను కాలు జారలేదు, చెయ్యి జారలేదు." వల్లికి ఒళ్ళు మండింది.

"అయితే కృష్ణమూర్తి చెప్పింది అబద్ధమంటావా?"

వల్లి కృష్ణమూర్తి వైపు మరోసారి అసహ్యంగా చూస్తూ "అవును" అంది స్థిరంగా.

కృష్ణమూర్తి, మురళి ఇద్దరూ తెల్లబోయి వల్లి వైపు చూశారు.

మురళికి ఏం చేయాలో అర్థం కాలేదు. అతడికి మనస్సులో ఎక్కడో సంతోషం పరవళ్ళు తొక్క సాగింది.

వల్లి అబద్ధం ఆడదు. అసలు అలాంటి పని చేయనే చేయదు. నిప్పులాంటి మనిషి. ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుంది. కృష్ణమూర్తే ఏదో మాయ చేద్దా మనుకుంటున్నాడు.

ఇంతలో వల్లి "ముందు ఈ దుర్మార్గుడిని బయటకు పంపండి" అంటూ అరిచింది. అంతలోనే రెండు చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి

ఏడవసాగింది.

మురళి కృష్ణమూర్తి వైపు చూశాడు. అప్పటికే కృష్ణ మూర్తి లేచి నిలబడి ఉన్నాడు. అతడి మొహం కోపంతో జేవురించి ఉంది.

"కృష్ణమూర్తీ ... ప్లీజ్... గెటవుట్!" మురళి కఠినంగా పలికాడు.

కృష్ణమూర్తి ఏమో చెప్పబోయాడు. కాని మురళి మొహం చూడగానే ఆ ప్రయత్నం మాను కొని గబగబ బయటపడ్డాడు.

అతడు వెళ్ళిపోగానే మురళి వల్లి దగ్గరకు నడిచి, ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"వల్లీ... అసలేం జరిగింది?" అనునయంగా, ఆప్యాయంగా అడిగాడు.

వల్లి ఏడుస్తూ మురళిని చుట్టుకుపోయింది. జరిగినదంతా మరోసారి ఆమె కళ్ళముందు మెదిలింది.

• • • •

ఆ రాత్రి చాలాసేపు కబుర్లు చెప్పుకున్న తర్వాత వల్లి లేచి గుడ్‌నైట్ చెప్పి వెనక గదిలోకి వెళ్ళి బెడ్డింగ్ పరుచుకుని పడుకొంది.

ఆరు నెలల గాఢ పరిచయం వలన ఏర్పడిన నమ్మకంతో వల్లి తలుపులు గడియ పెట్టుకోకుండా నిరభ్యంతరంగా పడుకుంది.

గాఢ నిద్రలో ఉండగా తన మీద ఏదో బరువుగా అన్పించటంతో చీకట్లోనే కళ్ళు విప్పి చూసి ఉలిక్కి పడింది.

భయంతో పెద్దగా అరవబోయింది. చప్పున కృష్ణమూర్తి ఆమె నోరు మూసేశాడు. అత డెవరో తెలుసుకొన్న వల్లికి తల తిరిగి పోయింది. ఏమనటానికీ ఆమెకు నోరు రాలేదు. పెద షాక్. కలలో కూడా వూహించని సంఘటన ఇది. అతనితో పెనుగులాట ప్రారంభమయింది.

ఆమె నరనరాన చెప్పలేని అసహ్యం, జుగుప్స నిండి పోయింది.

"ఎంత మోసగాడివి ... యూ స్టుపిడ్ ... వదులు!" విదిలించుకో బోయింది.

కృష్ణమూర్తి క్రూరంగా నవ్వాడు. ఆమెను ఎటూ కదలకుండా బంధించి, "మంచితనం నటించి నీ లాంటి అందమైన అమ్మాయిలను వశపరుచు కోవటమే నా హాబీ" అన్నాడు.

కృష్ణమూర్తి ఆమె కళ్ళకు మేకతోలు కప్పుకున్న పులిలా కనిపించాడు. మంచితనమనే ముసుగు ధరించి ఆడపిల్లల జీవితాల్ని నాశనంచేసే పిశాచిగాకనిపించాడు. వల్లి ఎంత పెనుగులాడినా లాభం లేకపోయింది. ఆమెలోని శక్తి నీరసించి పోయేసరికి ఆమె అసహాయ తను ఆధారంగా తీసుకుని కృష్ణ మూర్తి తన కోరిక తీర్చుకున్నాడు.

వల్లి శిలలా మిగిలి పోయింది. ఆ క్షణం ఆమెకు ప్రపంచంలోని మగాళ్ళందరి మీద చెప్పలేని అసహ్యం వేసింది.

జంతువుల్లో క్రూరమైన జంతువు లున్నాయని తెలుసు. కాని మనుషుల్లో కూడా అంతకు మించి పోయిన వాళ్ళున్నారన్న సంగతి ఇప్పుడే తెలిసింది. ఎంతో జాగ్రత్తగా ఉంటి తను ఎంత నమ్మకంగా మోసపోయింది? కలో కూడా అనుకోని, వూహించని దారుణమైన సంగతి ఇది. అబ్బ! తల పగిలి పోతే



బాగుండును. అసలు వాణ్ణి చంపేస్తే... మురళికి చెపితే...వూహూఁ. ఎంతైనా మగవాడు. పెళ్ళికి ఒప్పుకోకపోతే ఏం చేయాలి? తన జీవితం కుక్కలు చింపిన విస్తరి అవుతుంది. ఒకవేళ విశాల మనస్సుతో మురళి చేసుకున్నా ఆ సంసారంలో సుఖ శాంతులే ఉండవు. అనుక్షణం భరించలేని ఈ చేదువిజం తల పుకు రావటం...కలతలు, కన్నీళ్ళు అనుమానాలు. వద్దు...వద్దు. ముందు ఇక్కడినుండి వెళ్ళిపోవాలి. ముందు గదిలోకి తొంగి చూసింది. కృష్ణమూర్తి హాయిగా నిద్రపోతూ కనిపించాడు.

'చంపేస్తే' అనుకుంది ఒక్క క్షణం.

వెంటనే ఆమె కళ్ళ ముందు పోలీసులు, కోర్టు, జైలు గోడలు కనిపించాయి. మురళి పిచ్చివాడిలా తిరగటం. .. తల్లి గుండెఆగి చచ్చిపోవడం—ఇవన్ని మసకగా ఆమె బుర్రలో తిరిగాయి.

"ఛీ. వీడికి భగవంతుడే శిక్ష వెయ్యాలి. ఎప్పుడో ఒకసారి వీడి పాపం పండక పోదు."

తెల వార్లూ వల్లి అలానే కూర్చుండి పోయింది. అయిదు న్నరవు తుండగాలేచి బయటపడి స్టేషన్‌కు వచ్చి, టికెట్ కొనుక్కుని అప్పుడే ప్లాట్‌ఫారం మీదకు వచ్చిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఎక్కేసింది.

ట్రైవిలో ఎలా కూర్చుందీ, ఎప్పుడు వరంగల్ వచ్చిందీ, ఇంటో కొచ్చి ఎలా నడిందీ గుర్తు లేదు. ఆలోచించి ఆలోచించి బుర్రంతా శూన్యమై చలన రహితంగా ఉండిపోయింది.

• • • •

వల్లికి జరిగినదంతా గుర్తు కొచ్చేసరికి గుండె లోంచి దుఃఖం మళ్ళీ ఎగదన్నింది. కృష్ణమూర్తికి బుద్ధి చెప్పాలనే మురళితో అబద్ధ మాడాల్సి వచ్చింది. లేకపోతే కృష్ణమూర్తి తనను వదలడు. అతడు ముందే ప్లాన్ ప్రకారం నమ్మించి ఇదంతా చేశాడు. ఈ విషయంలో తను మురళికి అన్యాయం చేస్తున్నా సరే. తన ప్రమేయం లేకుండా తనకు జరిగిన అన్యాయానికి తను ఎంతమాత్రం బాధ్యురాలు కాదు. ఈ సంఘంలో చేయని తప్పును ఒప్పుకుని తల వంచి బతకటం కన్న వేరే నరకం లేదు. ఆడది ఎంతసేపూ అబలగా ఉండిపోకూడదు. ఎదిరించి బతకడం నేర్చుకోవాలి. ఈ మగాళ్ళకు సంఘంలో శీలం విషయంలో ప్రాధాన్యం లేదు. అదే ఆడదాని కయితే శీలం విషయంలో తరిమి తరిమి కొడతారు. ఆడదానికి న్యాయం ఎక్కడా లేదు. మురళిని విడిచి తను బతకలేదు. చావాలన్నా ఎందుకు చావాలి? జరిగిన తప్పుకి తను బాధ్యురాలు కాదు. కనక మురళికి తను ద్రోహం చేస్తున్నాననే బాధ లేదు. చెప్పి లేని



పోని కలతలతో జీవితం నాశనం చేసుకునే కన్న చెప్ప కుండా జీవితంలో స్థిరపడటం మంచిది.

"వల్లీ! ప్లీజ్. ఏడవకు. జరిగింది చెప్పు." లాలనగా అడిగాడు మురళి.

వల్లి దుఃఖాన్ని మింగి మురళి వళ్ళో తల దాచు కుంది.

"ఆ రోజు హైదరాబాద్ వెళ్ళి కృష్ణమూర్తికి వెడ్డింగ్ కార్డు ఇచ్చాను, మురళీ. మనం పూర్తిగా అతడిని నమ్మాం కదా! అందుకని నిరభ్యంతరంగా భయం లేకుండా పడుకున్నాను. మధ్యరాత్రిలో వాడు లేచివచ్చి బలవంతం చేయబోయాడు. నేను గట్టిగా అరిచి కేకలు వేశాను. దానితో భయపడి వదిలేశాడు. నేను బాగా తిట్టాను. అప్పటికి తెల్లార వస్తుంటే లేచి స్టేషన్‌కి వచ్చి బండెక్కి ఇంటి కొచ్చేశాను."

"మరి అప్పుడే నా కెందుకు వచ్చి చెప్పలేదూ?" మురళి అడిగాడు.

"నేను చెప్పి లాభం లేదు. నీ ముందే వాడి పరువు తీయాలనుకున్నాను. ఎలాగూ వాడు నీ దగ్గర కొచ్చి మన పెళ్ళి చెడగొట్టడానికి ప్రయత్నిస్తాడని తెలుసు. నీ సంగతి నాకు తెలుసుగా! వాడిని తీసుకుని ఎలాగూ నా దగ్గరికి వస్తావని తెలుసు. అప్పుడు అసలు సంగతి చెబుదామనుకున్నాను."

"అబ్బ...నిజంగా ఎంత దుర్మార్గుడు! నాగుపాము లాటివాడు. మనుష్యుల్లో కూడా ఇంత విషముంటుం దనుకోలేదు" మురళి ఆశ్చర్యంగా అన్నాడు.

"ఛీ. . . ఇంక వాడి గురించి మాటాడొద్దు. అసహ్యం వేస్తుంది." వల్లి అంది.

"ఎంతలో ఎంత భయంకరం తప్పింది, వల్లీ! నువ్వు చెప్పేదాని మీదే నా జీవితం ఆధారపడి ఉందనుకున్నాను. నువ్వుకూడా అతడు చెప్పినది నిజమని ఒప్పుకుంటే తరవాత నా శవమే చూసిఉండే దానివి. నిన్ను నా ప్రాణం కన్న ఎక్కువగా ప్రేమి స్తున్నాను. నువ్వులేని జీవితం...ప్చ్! వూహించలేను."

మురళి చెప్పుకు పోతున్నాడు.

వల్లికి కళ్ళు నీళ్ళు తిరిగాయి. కొన్ని క్షణాలు గడిచిన తరవాత వల్లి అడిగింది.

"మురళీ! ఒక వేళ వాడు నా ఇష్టం లేకుండా బలవంతంగా అనుభవించి ఉంటే ఏం చేసేవాడివి? నన్ను పెళ్ళి చేసుకునే వాడివా?"

మురళి అనుకోని ఆ ప్రశ్నకు తెల బోయాడు. కొన్నినిమిషాలు ఆలోచించి "ఏమో! చెప్పలేను, వల్లీ. నీ తప్పు లేకపోయినా ఒకవేళ అలా జరిగిఉండి నిన్ను చేసుకున్నా మన మధ్య మనశ్శాంతి ఉంటిది కాదేమో. ఎందుకో అలా అనిపిస్తుంది. అసలు ఏ మగాడూ భరించ లేడు. తన భార్య పవిత్రంగా ఉండాలనే ప్రతి మగాడూ కోరుకునేది."

మురళి మాటలు వినగానే వల్లి కి గుండె మీద నుంచి పూర్తిగా బరువు తీసేసినట్టయింది. అతడి చుట్టూ చేతులు పెనవేసి ప్రశాంతంగా కళ్ళు మూసుకుంది. మురళి కూడా సమాజంలో బతుకు తున్న కొన్ని వేల మందిలో ఒకడు.

మూసుకున్న ఆ కనురెప్పల వెనక కనిపించిన భయంకరమైన చీకటిలో ఏదో చుక్క లాటి వెలుగు దారి చూపు తున్న ట్లనిపించింది వల్లి కి. ★